
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు

5

శుక్రవారం 7 జూన్ 2024



నేడు అన్నారానికి జస్టిస్ పీసీ ఘోష్

భూపాలపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ ఎక్వైరీలో భాగంగా శుక్రవారం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ అన్నారం బ్యారేజీని సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు అల్పాహారం ముగించుకుని నేరుగా హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన జిల్లాలోని మహదేవపూర్ మండలంలో గల అన్నారం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.15 గంటలకు బ్యారేజీకి చేరుకున్న తర్వాత సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు అన్నారం బ్యారేజీని పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఎన్‌టీపీసీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు. 8వ తేదీ ఉదయం సుందిళ్ల బ్యారేజీని పరిశీలిస్తారు.

గిట్లెట్లయ్యే?

గెలుపు ధీమాలో ఉన్న బీజేపీకి ఓరుగల్లు ఓటర్ల ఝలక్

- చరిత్రను పునరావృతం చేయాలనుకున్న కమలనాథుల ఆశలపై నీళ్లు
- లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై కేడర్ అంతర్మథనం
- బలమైన నాయకత్వం లేక పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనుకబాటు
- 'అసెంబ్లీ'లో కాంగ్రెస్‌కు ఓట్లేసినట్లే తమకూ వేస్తారనే అతివిశ్వాసం
- ప్రచారంలో వరంగల్‌పై దృష్టిపెట్టని రాష్ట్ర స్థాయి నేతలు
- ఓడినా భారీగా ఓట్లు పొందామంటూ సర్దిచెప్పుకుంటున్న నాయకులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కమలనాథుల ఆశలపై ఓరుగల్లు ఓటర్లు నీళ్లు చల్లారు. 1984 నాటి చరిత్రను పునరావృతం చేస్తామన్న ధీమాలో ఉన్న బీజేపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. మోదీ చరిష్మాతో వరంగల్ ఎంపీ స్థానంలో పాగా వేయాలనే పక్కా వ్యూహంతో బరిలో దిగినా 'గిట్లెట్లయ్యే..' అంటూ బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు. అయితే వ్యూహప్రతివ్యూహాలు ఎలా ఉన్నా సవాళ్లను అధిగమించటంలో బీజేపీ విఫలమైందన్న చర్చ జరుగుతుండగా.. ప్రచారం విషయంలో రాష్ట్ర నాయకత్వం వరంగల్‌పై అంతగా దృష్టిపెట్టలేదని, అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేక ప్రత్యర్థులకు దీటుగా పోల్‌మేనేజ్‌మెంట్ చేయలేకపోయారని, శ్రేణులు కూడా చేతులెత్తేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా 40ఏళ్ల నాడు వరంగల్‌లో బీజేపీ జెండా ఎగరిందని, మళ్లీ ఇప్పుడు ఎగరవేయబోతున్నామని ప్రచారంలో చెప్పుకొచ్చిన బీజేపీ నేతలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు మింగుడుపడటంత లేదు. ఎక్కడెక్కడ తమకు ఓటు బ్యాంకు పెరిగింది.. ఎక్కడెక్కడ తాము నష్టపోయామని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటూ ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటున్నారు.

చరిత్ర తిరగరాయడంలో భంగపాటు..

వరంగల్‌లో బీజేపీకి ఓ చరిత్ర ఉంది. 1984 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా రెండే ఎంపీ స్థానాల్లో విజయం సాధించగా.. అందులో ఒకటి వరంగల్. వరంగల్ (పాత హనుమకొండ) లోక్‌సభ స్థానం నుంచి నాడు చందుపట్ల జంగారెడ్డి ఎంపీగా విజయం సాధించారు. 1989లో మరోసారి జంగారెడ్డి పోటీ చేసినా విజయం సాధించలేదు. అప్పటి నుంచి బీజేపీ వరంగల్ స్థానంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేదు. అయితే కేంద్రంలోని నరేంద్రమోదీ చరిష్మాతో తెలంగాణలో బీజేపీకి ఓ ఊపు వచ్చింది. దీంతో ఈ ఊపులో వరంగల్‌లో కూడా గెలిచి 1984 చరిత్రను పునరావృతం చేయాలని భావించిన బీజేపీ.. బలమైన నేత కోసం వెతికింది. ఈ క్రమంలోనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని బరిలో దించింది. దీంతో బీజేపీకి క్రేజ్ పెరిగింది. యువత, మహిళలు, రైతులతో పాటు పట్టణ ఓటర్లు ఈసారి తాము మోదీకే ఓటేస్తామంటూ బహిరంగంగానే చెప్పే స్థాయికి బీజేపీ చేరింది. దీంతో వరంగల్‌లో బీజేపీ గెలుస్తుందనే చర్చ జరిగింది. కానీ అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలవడం.. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఓటమిపాలై రెండో స్థానంలో నిలవడం చర్చనీయాంశంగా మారింది. చరిత్రను తిరగరాస్తామన్న ధీమా వ్యక్తం చేసిన కేడర్‌ను ఈ ఓటమి కుంగతీసింది.

పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఫెయిల్..

వరంగల్ ఎంపీ స్థానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. పోలింగ్ బూత్‌ల నుంచి కేడర్‌కు, సమావేశాలకు కావాల్సిన ఫండింగ్ కూడా పార్టీ నుంచే అందినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోల్‌మేనేజ్‌మెంట్‌లో మాత్రం పార్టీ చేతులెత్తేసిందనే చర్చ నడుస్తోంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం ఉన్న బీజేపీ అభ్యర్థికి పోల్‌మేనేజ్‌మెంట్‌పై పూర్తి అవగాహన ఉంది. అయితే ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ ఓటర్లకు కూడా నజరానాలను చేరవేశారని, ఇందుకోసం భారీగానే ఖర్చు చేశారన్న ప్రచారం జరుగుతోంది. కానీ పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో మాత్రం బీజేపీ మీనమేషాలు లెక్కించిందని, ప్రత్యర్థి పార్టీలకు దీటుగా ఓటర్లకు బీజేపీ నుంచి నజరానాలు అందలేదనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థులు పంపిణీ చేసిన దాంట్లో 50శాతమే ఇచ్చినప్పటికి అవి కూడా 30శాతం ఓటర్లకే చేరాయని, బలమైన అభ్యర్థిగా పేరుండటంతో ఓటర్లు కూడా అదే స్థాయిలో నజరానాలు ఆశించినట్లుగా ప్రచారం జరిగింది. కానీ ఇందులో కమలనాథులు చేతులెత్తేయటంతో కేడర్‌తో పాటు ఓటర్లు అసంతృప్తికి గురైనట్టు చర్చ జరుగుతోంది. దీంతో అప్పటి వరకు బీజేపీకే ఓటేయాలని నిర్ణయించుకున్న ఓటర్లు కూడా చాలా వరకు మనస్సు మార్చుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ వైపు చూశారని తెలుస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రాకున్నా గెలిచారని, అదే తరహాలో తమకు మోదీ చరిష్మా కలిసొస్తుందని, నజరానాలతో పని లేకుండా ఓటర్లు తమను ఆశీర్వదిస్తారన్న అతి విశ్వాసం కూడా బీజేపీ ఓటమికి ఓ కారణంగా చెబుతున్నారు.

దృష్టి పెట్టని పెద్ద లీడర్లు..

బీజేపీ ఓటమికి మరో ప్రధాన కారణం నాయకత్వ లేమిగా చెప్పుకొంటున్నారు. బీజేపీపై ప్రజల్లో సానుభూతి వచ్చినప్పటికి, దానిని ఓటు రూపంలో మార్చుకోవడంలో బీజేపీ విఫలమైందని, అన్ని చోట్ల నాయకత్వం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి 2,182 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కానీ పార్లమెంట్‌కు వచ్చే సరికి మోదీ చరిష్మా కారణంగా ఇక్కడ యువత బీజేపీ వైపు మొగ్గు చూపారని, అనూహ్యంగా బీజేపీకి 28,452ఓట్లు పోలయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అదే ఇక్కడ బలమైన నాయకత్వం ఉండి ఉంటే ఇంకా భారీగా ఓట్లు పడే అవకాశం ఉండేదనే చర్చ జరుగుతోంది. అలాగే స్టేషన్‌ఘనపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4,984 ఓట్లు మాత్రమే రాగా.. లోక్‌సభ ఎన్నికలో 40,332 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కూడా పాలకుర్తి పరిస్థితే ఉందని, ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేకపోవటంతోనే బీజేపీ మూడో స్థానానికి పరిమితమైందన్న చర్చ జరుగుతోంది. ఇక బలమైన నాయకత్వం ఉండటం కారణంగా వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీకి భారీగా ఓట్లు పోలయ్యాయని, ఫలితంగా భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేటలో పార్టీ రెండోస్థానంలో నిలిచిందని, కానీ పార్టీలో నేతల మధ్య ఆధిపత్య పోరుతో నష్టం జరిగిందనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఓ వైపు రాష్ట్ర నాయకత్వం పంపించిన ఇన్‌చార్జ్‌ల పెత్తనంతో చాలా మంది కీలక నేతలు అంటీముట్టనట్టు వ్యవహరించారనే ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు వరంగల్ సీటుపై బీజేపీ దృష్టిపెట్టినా ప్రచారానికి కీలక నేతలు దూరంగా ఉండటం కూడా బీజేపీకి నష్టం చేకూర్చిందనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో మోదీ సభ సక్సెస్ కావడం శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని, ఆ సభ ప్రభావం పట్టణ ప్రాంతాల్లోనే చూపిందని, అందుకే పట్టణప్రాంతాల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ లాంటి నేతలు ప్రచారానికి రాకపోవటం కూడా మైనస్ అయ్యిందని, ఇతర రాష్ట్రాల సీఎంలు, ముఖ్య నేతలు ప్రచారానికి వచ్చినా పెద్దగా ఒనగూరిందేమీ లేదని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు.

ఓట్లు పెరిగాయనే సంతృప్తిలో కమలం..

గెలుస్తామన్న సీటు గెలవకపోయినా కనీసం చెప్పుకోదగ్గ స్థాయిలో ఓటు బ్యాంకు పెరిగిందనే సంతోషంతో కొందరు బీజేపీ నేతలు సర్దుకుపోతున్నారు. ఇప్పటికే వరంగల్‌లో ఓటమిపై అధిష్ఠానం ఆరా తీస్తుండటంతో ప్రధానంగా పోల్‌మేనేజ్‌మెంట్ కారణంగానే ఓడిపోయామని కీలక నేతలు సమాధానం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వరంగల్‌తూర్పులో మొదటి స్థానంలోకి రావటంతో పాటు భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట, వరంగల్‌పశ్చిమ నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో నిలిచామని బీజేపీ నేతలు అధినాయకత్వానికి వివరిస్తున్నారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయితే.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 3,60,955ఓట్లు పోలయ్యాయనని, అప్పటికి ఇప్పటికి 2,04,317 ఓట్లు పెరిగాయని బీజేపీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

గత అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పోలయిన ఓట్లు ఇలా..

నియోజకవర్గం	అసెంబ్లీ	లోక్‌సభ
స్టేషన్‌ఘనపూర్	4,984	40,332
పాలకుర్తి	2,982	28,452
పరకాల	38,735	44,841
వరంగల్ పశ్చిమ	30,826	60,611
వరంగల్ తూర్పు	52,105	74,581
వర్ధన్నపేట	12,275	57,427
భూపాలపల్లి	14,731	49,631
పోస్టల్	00	5,080
మొత్తం	1,56,638	3,60,955

గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6: ఈనెల 9న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం భూపాల పల్లిలోని కలెక్టరేట్‌లో గ్రూప్-1 ప్రిలి మ్స్ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మి శ్రా మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణ అత్యంత కీలకమని, ఎటు వంటి మాల్‌ప్రాక్టీస్ లేకుండా ప్ర శాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,394 మంది పరీక్ష రాయనున్నందున 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతున్నందున అభ్యర్థులు ఉదయం 9 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. గుర్తింపు కార్డు లేని వ్యక్తులను పరీక్ష కేంద్రాల ఆవరణలో ఉండకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు పాటుపడుదాం

జిల్లా వైద్యాధికారి మధుసూదన్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మధుసూదన్

కాకతీయఖని, జూన్ 6: దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. గురువారం భూపాలపల్లి పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మధుసూదన్ హాజరై మాట్లాడుతూ పెద్దలలో టీబీ నివారణకు బీసీజీ టీకాపై అధ్యయనం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి క్షయవ్యాధి నివారణ టీకాలు వేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. గత 5 సంవత్సరాలలో క్షయ వ్యాధి బారిన పడిన వారు, వారి కుటుంబ సభ్యులు, 60 సంవత్సరాల పైబడిన వారు, హెచ్ఐవీ, మధుమేహం వ్యాధిగ్రస్తులు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారు ఈ వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులన్నారు. ఈ టీకా వలన ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఎన్‌ఈపీటీ శ్రీగణ, వైద్యులు ప్రశాంత్, బిందు భార్గవి, పణిందర్, కొమురయ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

- నల్లగొండలో కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఫస్ట్‌ప్రయారిటీలో మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యం
- ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్య కోటా ఓట్లు రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం
- నేటి సాయంత్రానికి తుదిఫలితం వచ్చే అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నిక ఫలితం ఇంకా తేలలేదు. గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయినా కోటా ఓట్లు రాకపోవడంతో రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి గానీ విజేతపైస్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. గురువారం మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లున్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఈ ఉపఎన్నికలో మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన 48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యా క, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమా ర్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయ న ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య

మిగతా 8వ పేజీలో...

మొత్తం ఓట్లు : 4,63,839, పోలైన ఓట్లు : 3,36,013, అభ్యర్థుల సంఖ్య : 52

మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలు

చెల్లని ఓట్లు 25,824, చెల్లిన ఓట్లు 3,10,189, కోటా ఓటు 1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824

వర్ష బీభత్సం

భూపాలపల్లిటౌన్, జూన్ 6 : జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. కాటారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం విపరీతంగా కురిసింది. గంగారం, దేవరాంపల్లిలో వర్షం భారీగా పడింది. శంకరంపల్లిలో పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి చెందింది. అలాగే కాటారం, మంథని మార్గమధ్యలో రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దేవరాంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిముద్దయింది. చిట్యాల, టేకుమట్లలో ఓ మోస్తారు వర్షం కురిసింది. చిట్యాలలో చెట్టుపై పిడుగు పడడంతో మంటలు లేశాయి. భూపాలపల్లిలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని సుభాష్‌కాలనీలో గల వారాంతపు సంతలో కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలిమెల మండలంలోని ముకునూరులో పిడుగుపాటుకు పది ఆవులు, ఎద్దులు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మహదేవపూర్, మల్హర్‌లో స్వల్పంగా వర్షం కురిసింది. మహాముత్తారం మండలం కోనంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. రేగొండ మండలంలో కూడా వర్షం కురిసింది.

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

- నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ
- నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు
- రాళ్లతో ప్రయాణికుల దాడి.. ప్రతిదాడులు చేసిన దుండగులు
- బాధితురాలిది విజయవాడ.. కాజీపేట రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు

6లో



కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితులు కవిత దంపతులు

ప్రశాంతంగా ముగిసిన ఐసెట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 : ఐసెట్-2024 గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజులు సీబీటీ పద్ధతిలో జరుగుతున్న ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఐసెట్ కన్వీనర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. బుధ, గురువారాల్లో ఆంధ్ర, తెలంగాణలో జరిగిన పరీక్షకు 86,156 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 77,942 మంది (90.47 శాతం) హాజరయ్యారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో ఎంపిక చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 4,659 మందికి గాను 4,364 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 8న ఐసెట్ ప్రాథమిక కీ విడుదల చేస్తున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు. అభ్యంతరాలున్న విద్యార్థులు జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్-2024 పోర్టల్‌లో వారి అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చన్నారు.

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

చిలుపూర్/కాజీపేట, జూన్ 6: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని నష్కల్ - పెండ్యాల రైల్వే ట్రాక్ వద్ద దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో రైలు ఆగిన తర్వాత నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికుల మెడల్లోంచి దొంగల ముఠా బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్లు, బ్యాగులు చోరీ చేశారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5తోపాటు ఎస్-11 స్లీపర్ కోచ్‌లలో ఈ చోరీలు జరిగినట్లు తెలుస్తోంది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్, బాధితురాలు అన్నె కవిత తెలిపిన వివరాలు ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన అన్నెపు కవిత.. తన భర్త సాయిరమేశ్, ఇద్దరు పిల్లలు, మామతో కలిసి షిరిడీ దర్శనానికి వెళ్లింది. తిరిగి విజయవాడకు వచ్చేందుకు సికింద్రాబాద్‌లో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. అయితే నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా నర్సాపూర్ రైలు నష్కల్ సమీపంలోకి రాగానే లోకోపైలెట్ వేగం తగ్గించాడు. అయితే దుండగులు ఇదే అదునుగా భావించి ఆ రైలులో కిటికీ పక్కన నిద్రిస్తున్న అనిత మెడలో ఉన్న బంగారు గొలుసును బయటనుంచి లాగారు. మధ్య బెర్త్‌లో నిద్రిస్తున్న కవిత మెడలో నుంచి ఎవరో చైన్‌లాగినట్లు అనిపించడంతో ఒక్కసారిగా అప్రమత్తమై లేచింది. అప్పటికే దుండగులు గొలుసు లాగేశాడు. అలాగే అమె మెడలో నుంచి మరో బంగారు తాళిని తెంపే క్రమంలో గట్టిగా పట్టుకుంది. కిటికీల్లో నుంచి చూడగా దుండగులు ఒకరి భుజంపై మరొకరు ఎక్కి కిటికీల వద్ద ఉన్న ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీలు చేస్తున్నారు. దీంతో కవిత పెద్దగా కేకలు వేయడంతో నిద్రమత్తులో ఉన్న మిగతా ప్రయాణికులు అందరూ లేచారు. కవిత కేకలకు పారిపోతున్న దొంగలను చూసిన ప్రయాణికులు రైలు దిగి రాళ్లతో దాడి చేస్తూ దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగలు సైతం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న రాళ్లతో ప్రతిదాడులు చేశారు. వెంటనే ప్రయాణికులు తిరిగి రైలెక్కి రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమమైన రైల్వే అధికారులు రైల్వే టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేశారు. ఆపై రైలు యథావిధిగా వెళ్లింది.

గురువారం ఉదయం రైల్వే జీఆర్పీ పోలీసులతో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, చిలుపూర్ ఎస్ఐ ముత్యం రాజేందర్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కాగా, కవిత తన కుటుంబంతో సహా విజయవాడకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. 12 గ్రాముల బంగారు చైన్‌తో పాటు ఇతర వస్తువులు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాలపై పోలీసులను వివరణ అడగగా.. నష్కల్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల దృష్ట్యా రైలు మెళ్లగా వస్తుండడంతో దుండగులు దోపిడీకి పాల్పడ్డారా..? అదే రైలులో వచ్చి రైలు ఆగగానే దోపిడీ చేశారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీ అయ్యాయో పూర్తి వివరాలు తెలియడం లేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత వివరాలు వెళ్లడిస్తామని పోలీసులు అంటున్నారు.

ఇదిలా వుండగా, అర్ధరాత్రి చీకటిలో జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సినీ పక్కీలో జరిగిన ఈ చోరీలను చూస్తున్న ఇతర ప్రయాణికులు అసలు ఏమి జరుగుతుందో అర్థంకాకుండా ఉండిపోయారు. తొలుత దోపిడీ దొంగలు అర్ధరాత్రి రైల్లోకి చొరబడి మహిళలను మారణాయుధాలతో బెదిరించి వారి మెడల్లోంచి 25 తులాల బంగారాన్ని దోచుకెళ్లినట్టు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఈ చోరీల్లో సుమారు 20 మంది ముఠా సభ్యులు పాల్గొన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.



నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో విచారణ చేపడుతున్న పోలీసులు

28న డాక్ అదాలత్

సుబేదారి, జూన్ 6: తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుంచి స్వీకరించేందుకు ఈ నెల 28న పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ వారు 46 డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల14 లోపు కె.శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ఆఫీస్ ఆఫ్ పోస్టు మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ 500001కు వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాల్‌పల్లి, జనగామ జిల్లాల ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. పోస్టల్ కవర్‌పై 46 డాక్ అదాలత్ అని రాసి పంపించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపటి నుంచి దూరవిద్య పీజీ ప్రాక్టికల్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ దూరవిద్య పీజీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫస్టియర్ పరీక్షల ప్రాక్టికల్ పరీక్షలు శనివారం (జూన్ 8)నుంచి ప్రారంభిస్తున్నట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న బోటనీ, 9న ఫిజిక్స్, 12న జువాలజీ, కెమిస్ట్రీ, 13న కెమిస్ట్రీ మరో పేపర్ ఉంటాయని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత డిపార్ట్‌మెంట్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

జేఎన్ఎస్‌లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు



100 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 6: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి పది రాష్ట్రాల నుంచి 971మంది అథ్లెట్లు, 100మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ హనుమకొండ వాస్తవ్యుడు కావడం మనకు ఎంతో గర్వకారణమని కొనియాడారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజు 1000, 1500, 10వేల మీటర్ల పరుగు పందెం, షాట్‌ఫుట్, లాంగ్‌జంప్, 400, 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్, 300మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 150మీటర్ల పరుగు, 80, 50 మీటర్లు పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, హెప్టథ్లాన్, డెకాథ్లాన్, జావెలిన్‌త్రో, ట్రిపుల్‌జంప్, 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, 4ఇంటూ400రిలే విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15 నుంచి 17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

కాగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు జీవంజి దీప్తి, అగసర నందిని, సాయి సంగీతలు క్రీడా మైదానంలో సందడి చేశారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను చూసి మైదానంలో పలువురు చిన్నారులు, వర్ధమాన అథ్లెట్లు సెల్ఫీలను దిగుతూ అలరించారు. ఈ సందర్భంగా పారా ఒలంపియన్ జీవంజి దీప్తి, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్ నందినిలను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అసోసియేషన్ బాధ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీజోన్స్, చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్, అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, చంద్రమోహన్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు వాసుదేవ్, మనోజ్‌కుమార్, సోమేశ్వర్, జగన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి..

జీవంజి దీప్తి, అంతర్జాతీయస్థాయి పారా అథ్లెట్, కల్లెడ

జపాన్ దేశంలోని యూనివేసియేడ్ మెమోరియల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్ టీ20 చాంపియన్‌షిప్ 400మీటర్ల పరుగుపందెంలో 55.07 సెకన్లలో గమ్యాన్ని చేరి ప్రపంచ రికార్డు నెలకొల్పాను. అథ్లెటిక్స్‌లో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై స్వర్ణ, రజత పతకాలు సాధించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదు. నిరుపేద కుటుంబంలో జన్మించిన నాకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు భరోసాగా నిలవాలి.

ఒలింపిక్స్‌లో అర్హత సాధించడమే లక్ష్యం

సాయి సంగీత, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ మహబూబ్‌నగర్

ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన జూనియర్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4ఇంటూ400రిలేలో స్వర్ణం సాధించాను. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే కఠోర సాధన చేయాలి. కోచ్‌ల ప్రత్యేక శిక్షణలో తర్ఫీదు పొందుతూ వారు చూపించిన విధంగా నడుచుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుకుంటూ అక్కడి కోచ్ వద్ద అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సంవత్సర కాలంగా కర్నాటక రాష్ట్రంలోని మంగుళూర్‌కు చెందిన కోచ్ అజిత్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటూ అక్కడే డిగ్రీ ప్రథమ సంవత్సం చదువుతున్నా.

అంతర్జాతీయ క్రీడాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

అగసర నందిని, ఏషియన్ గేమ్ మెడలిస్ట్ హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సహంతోపాటు నివాస స్థలం కేటాయించాలి. ఇతర రాష్ట్రాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారులు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇటీవల చైనాలో జరిగిన హెప్టథ్లాన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాను. ఈ నెల 27నుంచి 31 వరకు హరియాణా రాష్ట్రంలోని పంచకుల లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల హెప్టథ్లాన్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి ఒలంపిక్స్ అర్హత సాధించేందుకు కసరత్తు చేస్తున్నా.

దర్గాలో ప్రార్థనలు.. అమ్మవారికి పూజలు

కాజీపేట దర్గా, భద్రకాళిని దర్శించుకున్న కడియం కావ్య



కాజీపేట దర్గాలో ప్రార్థన చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య తదితరులు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కావ్యకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

కాజీపేట టౌన్ / వరంగల్ కల్చరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కడియం కావ్య గురువారం కాజీపేట దర్గా, వరంగల్ భద్రకాళి ఆలయాలను సందర్శించారు. తన తండ్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాజీపేట దర్గాకు వచ్చిన ఆమెకు పీఠాధిపతి ఖుస్రుపాషా ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను వరంగల్ ప్రజలకు రుణపడి ఉంటానని, తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ముస్లింలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కోసం శ్రమిస్తానన్నారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా విలసిల్లుతోందన్నారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ అబూబకర్, మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే పలువురు కుటుంబ సభ్యులతో కలిసి కావ్య భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానార్చకుడు భద్రకాళి శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను కావ్యకు అందజేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన తోడ్పాటును అందించాలని వేడుకున్నానన్నారు.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలోని

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

దరఖాస్తుల దాఖలు గడువు పెంపు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైనిక్ స్కూల్/అకాడమీలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ (హెచ్ఈపీ), బీఎస్సీ (ఎంపీసీ) 40 చొప్పున సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుల దాఖలకు చివరి తేదీని జూన్ 15 వరకు పొడిగించిటన్టు తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి విద్యార్హత ఇంటర్, రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారని, ఫీజు రూ.100 అని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నింపి సంబంధిత పత్రాలు జత చేసి ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ (బి), అశోక్‌నగర్ పేరు మీదరూ. 100 డీడీ తీసి లేదా కింది ఏదేని నెంబర్‌కు యూపీఐ ద్వారా చెల్లించి స్క్రీన్ షాట్ జిరాక్స్, పూర్తి దరఖాస్తు కాపీని ప్రిన్సిపాల్ టీటీడబ్ల్యుఆర్ సైనిక్ స్కూల్ అశోక్‌నగర్, మండలం ఖానాపురం, వరంగల్ జిల్లా పిన్ కోడ్ 506132కు పంపాలని కోరారు. లేదా సంబంధిత జిరాక్స్ పత్రాలు (ఎస్ఎస్సీ మెమో, ఇంటర్ షార్ట్ మెమో, బోనోఫైడ్స్, క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్స్ సర్టిఫికెట్లు, 5 ఫోటోలు) తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9963584516, 9398068250, 8985469347 8978616155, 9553310104నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వెబ్‌సైట్ https://www.tgtwgurukulam.telangana.gov.in చూడాలని కోరారు.

కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్ ప్రకటన

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను రీషెడ్యూల్ చేస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పేపర్ జూన్ 11న, రెండో పేపర్ 13న, మూడో పేపర్ 15న, నాలుగో పేపర్ 19న, ఐదో పేపర్ 21న, ఆరో పేపర్ జూన్ 24న ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్ పోర్టల్‌లో చూడాలని సూచించారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సందర్శన

వెంకటాపురం(నూగూరు), జూన్ 6: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో గురువారం వెంకటాపురం మండల కేంద్రంలో ఇంటింటి సందర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ఇటీవల ప్రసవించిన బాలింతల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, రెగ్యులర్ టీకా, మందుల వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మక్కసాగర్ బ్యారేజీ నీటి విడుదల

కన్నాయిగూడెం, జూన్ 6 : మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజి నుంచి మొత్తం గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజికి ఎగువన గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులో కూరుకుపోయిన షిల్టును తొలగించేందుకు బ్యారేజిలోని నీటిని క్రమక్రమంగా ఒక్కో గేటు ఎత్తుతూ దిగువకు వదులుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టులోని చిన్నచిన్న మరమ్మతులు, షిల్టు తొలగింపు పనులు చేసేందుకు ఒక్కో గేటు ఎత్తుతూ గురువారం రాత్రికి బ్యారేజిలోని నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మావోయిస్టుల సమాచారం ఇవ్వాలని వాల్‌పోస్టర్లు

వాజేడు, జూన్ 6: మావోయిస్టు ల సమాచారం ఇవ్వాలని వాజేడు పోలీసులు పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో వాల్‌పోస్టర్లు అంటించారు. వాజేడు ఎస్సై సీహెచ్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మారుమూల గ్రామమైన కొంగాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో ఎస్సై మాట్లాడుతూ కాలంచెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న విప్లవ పార్టీలకు ఎవరూ సహకరించవద్దని తెలియజేశారు. మావోయిస్టుల వల్ల ప్రజలకు నష్టం తప్ప లాభం లేదని, ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు గ్రామ పరిసర ప్రాంతాల్లో కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. అనంతరం జగన్నాథపురం వైజంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు.

సైక్లింగ్ కోచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు కలెక్టరేట్, జూన్ 6: ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో సైకిలింగ్ కోచ్‌గా పనిచేసేందుకు అర్హులైన 40ఏళ్ల లోపు వారు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ కాంపిటీషన్, సీనియర్ నేషనల్, మెడల్ విన్నర్ ఖేలో ఇండియా గేమ్స్, మోడల్ విన్నర్ ఆలిండియా యూనివర్సిటీ, సీనియర్ నేషనల్ ఫాస్ట్ చాంపియన్‌షిప్, తదితర క్రీడల్లో అర్హత కలిగి ఉండాలని అన్నారు.

టీటీడబ్ల్యూఆర్‌సీలో ఎస్టీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

కాటారం, జూన్ 6 : కాటారంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు)లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికై ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని ప్రిన్సిపాల్ జేకే బుచ్చయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఎస్టీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు శుక్రవారం నుంచి ఒరిజినల్ కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లతో పాటు 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో కళాశాల సమయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ములుగు కలెక్టరేట్, జూన్ 6: ములుగు జిల్లాకేంద్రంలో గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులోని బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2017-18లో కేజీ టు పీజీలో భాగంగా అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో 22 కళాశాలలను మంజూరు చేయగా ములుగు జిల్లాకు గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేసిందని అన్నారు. కొన్నిరోజుల పాటు మండలంలోని జాకారం వైటీసీలో తరగతులు నిర్వహించి ఆతర్వాత స్థల ప్రభావం వల్ల ములుగుకు మార్చబడిందని అన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా ఒగ్లాపూర్‌కు మార్చి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ములుగుకు మార్చలేదని అన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాకేంద్రంలోనే గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేయాలని, ఇందుకోసం మంత్రి సీతక్క కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేవైఎం నాయకులు దొంతిరెడ్డి రవిరెడ్డి, రాకేష్, ఇనుముల మహేష్, నరేష్‌వర్మ, సిద్ధార్థ, పోతరాజు రమేష్, దేవేందర్, సిద్దు, కార్తీక్ పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

(5వ పేజీ తరువాయి)

ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'బడిబాట' ప్రారంభం



ములుగు మండలం బండారుపల్లిలో మాట్లాడుతున్న డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, జూన్ 6 : జిల్లాలో బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. ములుగు మండలంలోని బండారుపల్లిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో పాణిని మాట్లాడుతూ ఉదయం 7నుంచి 11గంటల వరకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న పనులను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, సాంబయ్య ప్రధానోపాధ్యాయులు నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్(రామప్ప) : మండలకేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ర్యాలీ తాళ్లపాడు సెంటర్ వరకు కొనసాగగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని, ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అదేవిధంగా కేజీబీవీ ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పెండ్యాల సలేంద్రం, జనగాం బాబూరావు, కిరణ్, సత్యం, ప్రవీణ, వేణు, సరిత,రజిత, లలిత, దేవి, చందన, శారద, మమత పాల్గొన్నారు.

• గోవిందరావుపేట : మండలంలోని దుంపెల్లిగూడెంలో జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, రాయప్ప, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జితేందర్, రవీందర్, హర్షిణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మల్హర్ మండలం వల్లెంకుంట పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

• తాడ్వాయి : మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట ర్యాలీలు నిర్వహించారు. తాడ్వాయి, కాటాపూర్, బీరెల్లి, లింగాల, దామెరవాయి, పంబాపూర్, గంగారం, నర్సాపూర్ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరిని బడిలో చేర్పించాలంటూ గ్రామాల్లోని వీధుల్లో ర్యాలీలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, ఉపాధ్యాయులు పాపారావు, వెంకటలక్ష్మి, రజిత, రేణుక, బాబూరావు, రవీందర్, లక్ష్మయ్య, శాలిని, కీర్తిమంతరావు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గుర్రేవులలోని ఎంపీపీఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం వేర్వేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎం.సంతోష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భూపతిపూర్, నాగపూర్ గ్రామాల్లో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతుల గురించి వివరించి పిల్లలను చేర్పించాలని కోరారు. గుర్రేవులలో మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్‌ఎం స్వరూప, ఎంపీపీఎస్ హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, క్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బడిబాటపై ఉపాధ్యాయులు సమీక్ష నిర్వహించి కార్యక్రమాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. మొదటి రోజు గురువారం కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించి నినాదాలు చేశారు. పలువురు వక్తలు బడిబాట ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

• వాజేడు : మండలంలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న పనులను క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి బడిబాట ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందరావు, ఏపీసీ వీవో పాల్గొన్నారు.

• వెంకటాపురం(నూగూరు) : మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

భూపాలపల్లి జిల్లాలో..

• రేగొండ : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో రాంకుమార్ విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. మండలంలోని రంగయ్యపల్లిలో జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వనేంద్రమణి ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో రాంకుమార్ హాజరై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి, మహేందర్, రవికుమార్, పరంజ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య పాల్గొన్నారు.

• చిట్యాల : మండల వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. నైన్‌పాకలో జడ్పీటీసీ గొర్రె సాగర్, మండల కేంద్రంలో ఎంఈవో కోడెపాక రఘు బడిబాటలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఊర్మిళ, ఝాన్సీరాణి, శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

• కాటారం :మండలంలో బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. పలు గ్రామాల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు గ్రామైక్య సంఘాల అధ్యక్షురాళ్లు, స్వశక్తి సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయడానికి సమిష్టిగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి బడిబాట ర్యాలీలు చేపట్టారు. ఈ నెల 11వ తేదీ వరకు ఉదయం పూట ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలలతో జరిగే ప్రయోజనాలను వివరించాలి.

• మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వల్లెంకుంట ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట నిర్వహించారు. వల్లెంకుంట పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రగతిని తెలుపుతూ కరపత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. గ్రామంలోకి ర్యాలీగా వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం, కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శ్రీకళ, ఉపాధ్యాయులు మహేశ్వర్, స్వర్ణకుమారి, అశోక్‌కుమార్, సత్యనారాయణ, రిబిక, పుష్పలత పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీరు

• యాజమాన్యాన్ని నిలదీసిన బాధితుడు



నీరు కలిసిన పెట్రోల్

చిట్యాల, జూన్ 6 : మండలంలోని కొత్తపేట శివారులో గల ఓ పెట్రోల్ బంక్ పెట్రోల్‌లో నీరు కలిసిందని బాధితుడు యాజమాన్యాన్ని గురువారం నిలదీశాడు. కొత్తపేట(ఎస్‌ఎం) గ్రామానికి చెందిన పాలిత రాజు స్థానికంగా ఇంటివద్ద పెట్రోల్, డీజిల్ అమ్ముతుంటాడు. రెండు రోజుల క్రితం కొత్తపేటశివారు బంక్‌లో రూ.2వేలు పెట్రోల్‌ను క్యాన్ ద్వారా ఇంటికి తీసుకువెళ్లాడు. కొంత మేర పెట్రోల్ విక్రయించగా చివరగా సుమారు 3 లీటర్ల పెట్రోల్ మిగలడంతో లీటరు బాటిళ్లలో నింపాడు. కొంతసమయం తర్వాత బాటిల్ అడుగు భాగంలో నీరు పేరుకపోవడంతో బంక్ ఆపరేటర్‌ను ఫోన్‌లో నిలదీశాడు. తనకేమి తెలియదని యాజమానితో మాట్లాడమనగా గురువారం బంక్ వద్దకు వచ్చాడు. బంక్ యాజమాని బంకులో ఎలాంటి కల్తీ పెట్రోల్ లేదని, ఇక్కడి నుంచి వెళ్లిపోకుంటే పోలీసులను పిలిపిస్తానని బెదిరించినట్లు బాధితుడు తెలిపాడు. వాహనదారుల సమక్షంలో మరోసారి నిలదీసి రెండు ప్లాస్టిక్ గ్లాసుల్లో పోసి ఎండలో బయటపెట్టారు. రెండు గంటలు సమయం అయినా పెట్రోల్ ఆవిరి కాకపోవడంతో పాటు గ్లాస్ చివరిలో నీరు పేరుకుపోవడంతో మరోసారి నిలదీశాడు. అయినా బంక్ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని జిల్లా అధికారులు స్పందించి బంక్‌లోని పెట్రోల్‌ను పరీక్షించి చర్యలు తీసుకోవాలని బాధితుడు రాజు డిమాండ్ చేశాడు. కాగా, నీరు కలిసిన పెట్రోల్ వినియోగించడం మూలంగా వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నారు.

భైరవ గుట్టపై తవ్వకాలు నిలిపివేయాలి



ప్రొక్లెయినర్‌తో గుట్టపై చేపడుతున్న తవ్వకాలు

మల్హర్, జూన్ 6: మండల కేంద్రమైన తాడిచర్ల మానేరు ఒడ్డున ఉన్న భైరవ గుట్ట(బయ్యన్నగుట్ట)పై తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మానేరు ప్రవాహం తాడిచర్లలోకి రాకుండా పెట్టని గోడలా నిలుస్తూ గ్రామాన్ని రక్షిస్తున్న గుట్ట తవ్వకాలను నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు. తాడిచర్ల ఓసీపీలో బొగ్గు వెలికితీత పనులు దక్కించుకున్న కంపెనీ ఈ గుట్ట త్వవకాలు చేపడుతోంది. గతంలో కూడా ఇదే మాదిరిగా గుట్టపై తవ్వకాలు చేపట్టడంతో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో పాటు జిల్లా, పురావస్తు శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో తవ్వకాలను నిలిపివేశారు. గతంలో పత్రికల్లో కథనాలు ప్రచురితం కాగా జిల్లా పాలానాధికారి కూడా పరిశీలించి తవ్వకాలను నిలిపి వేయాలన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మళ్లీ తవ్వకాలు చేపడుతున్నారు. 200 ఏళ్లపైన చరిత్ర కలిగిన ఈ గుట్టను ఇప్పటికే నామరూపాలు లేకుండా ధ్వంసం చేశారు. చరిత్రతో ముడిపడి ఉన్న గుట్టపై తవ్వకాలు ఆపాలని పలువురు కోరుతున్నారు. గుట్టను పూర్తిగా తొలగిస్తే మానేరు వరద ప్రవాహంతో తాడిచర్ల గ్రామానికి ప్రమాదం తప్పదని పలువురు భావిస్తున్నారు.

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

▸▸ శంకరంపల్లిలో పిడుగుతో దుక్కిటెద్దులు మృతి



శంకరంపల్లిలో పిడుగుపాటుతో మృతి చెందిన ఎద్దుల వద్ద రైతు

కాటారం, జూన్ 6: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పగలంతా సుర్రుమనే ఎండతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నల్లని మబ్బులు పట్టిన ఆకాశం ఉరుములు, మెరుపులతో గర్జిస్తూ భారీ వర్షం కురిసింది. శంకరంపల్లి ఎస్సీ కాలనీలో మామిడి తిరుపతికి చెందిన రెండు దుక్కిటెద్దులు పిడుగుపాటుతో దుర్మరణం చెందాయి. ఇంటివద్ద కట్టేసి ఉన్న ఎద్దులపై పిడుగు పడగా అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. సుమారు రూ.లక్షకు పైగా విలువచేసే దుక్కిటెద్దులు చనిపోయాయని, నిరుపేద అయిన తనకు ప్రభుత్వం పరిహారమందించి ఆదుకోవాలని బాధితుడు తిరుపతి కోరుతున్నారు. భారీ వర్షానికి పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టి మిల్లులకు తరలించేందుకు ఉన్న వడ్ల బస్తాలు కొంతమేర తడిసిపోయాయి. ధాన్యం కుప్పలు, వడ్లబస్తాలపై కప్పిన టార్పాలిన్లు, పరదాలు గాలులకు కొట్టుకుపోవడంతో రైతులు, కేంద్రాల నిర్వాహకులు నానాతంటాలు పడ్డా కొంత తడిసిపోయాయి.

• టేకుమట్ల : మండలంలోని అంకుషాపూర్‌లో తాడిచెట్టుపై పిడుగు పడింది. గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురియ గా గ్రామానికి చెందిన బొడ్డు రాజయ్య ఇంటి పక్కన ఉన్న తాడిచెట్టు పై పిడుగు పడింది. కాగా, చుట్టుపక్కల ఉన్న ఇండ్లలో ఎవరికి ఏం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అధికారుల కళ్లు గప్పి క్వార్టర్ ఆక్రమణ

▸▸ ఏరియాలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డు నిర్వాకం

కాకతీయఖని, జూన్ 6: సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ఏరియాలో కార్మికుల సౌకర్యార్థం క్వార్టర్స్‌ను నిర్మించగా, అధికారుల కళ్లు గప్పి ఓ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు గత సంవత్సర కాలంగా ఓ క్వార్టర్‌ను ఆక్రమించుకున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సెక్యూరిటీ గార్డు ఏడాదిగా అందులో నివాసం ఉంటుండగా ఏరియా సింగరేణి అధికారులు ఏంచేస్తున్నారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సింగరేణి సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగికి సమీప బంధువు కావడంతో ఆ క్వార్టర్‌లో అతను ఉంటున్నట్లు, పై అధికారుల దృష్టికి వెళ్లకుండా చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా ఆ క్వార్టర్‌ను కౌన్సిలింగ్‌లో పెట్టకుండా అధికారులను అతనే చూస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే సదరు ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఎస్ అండ్ పీసీలోని కిందిస్థాయి అధికారులను మచ్చిక చేసుకుని పార్టీలు ఇస్తూ తన పనిని సులువుగా చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం ఇటీవల ఓ కార్మిక సంఘం నాయకుడి దృష్టికి వెళ్లడంతో ఆయన సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కార్మికులు ఉండేందుకు క్వార్టర్లు లేక బయట కిరాయి ఉంటుంటే ఇతరులకు కౌన్సిలింగ్ లేకుండా క్వార్టర్లను కేటాయించడం సరికాదని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రారంభం

▸▸ 24 జీపీల పరిధిలో రూ.4కోట్లతో చేపట్టిన పనులపై తనిఖీలు

కాటారం, జూన్ 6 : మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు గురువారం తనిఖీలను ప్రారంభించాయి. సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ కొమురయ్య ఆదేశాల మేరకు పలువురు డీఆర్పీలు, వీఎస్‌ఏలు గ్రామాలకు తరలివెళ్లి తనిఖీలు చేపట్టారు. 2023, ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4కోట్ల నిధులతో చేపట్టిన ఈజీఎస్ పనులను తనిఖీ చేయనున్నారు. 12 ఆడిట్ బృందాలు తొలి విడతలో మండలంలోని 12 జీపీల పరిధిలో, రెండో విడతలో మరో 12 జీపీల్లో తనిఖీలు నిర్వహిస్తాయి. రెండు మూడు రోజులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం గ్రామ స్థాయిలో ఈనెల 8, 11వ తేదీల్లో గ్రామసభలు పెట్టి తనిఖీ సందర్భంగా తేలిన అంశాలను చర్చించడం జరుగుతుంది. గ్రామసభల్లో తనిఖీల సందర్భంగా వెల్లడైన లోపాలు, అవకతవకలు ఉంటే వెల్లడిస్తామని రేగులగూడెం జీపీ డీఆర్పీలు శ్రీశైలం, రవీందర్ తెలిపారు. గ్రామ సభల అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించనున్నారు.

దేవరాంపల్లిలో తాగునీటికి ఇబ్బందులు

కాటారం, జూన్ 6: మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి దేవరాం పల్లి ఎస్సీ కాలనీలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి నీటి సరఫరా చేసే బోరు మోటారు కాలిపోవడంతో ప్రజలు నీటి కోసం ఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు. కాలనీకి సమీపంలో ఓ వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీటిని బిందెలు, బకెట్లలో పట్టుకుని మోసుకెళ్తున్నారు. కొందరు ఎడ్లబండ్లలో డ్రమ్ములు నింపుకుని తెచ్చుకుంటున్నారు. కాలనీవాసులకు ప్రతీ ఏటా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, తమకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా నవీన్

మొగుళ్లపల్లి, జూన్ 6: మొగుళ్లపల్లి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నూతన మేనేజర్‌గా బానోత్ నవీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసిన ధర్మరాజు హనుమకొండకు బదిలీ కాగా, మరిపెడలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేసిన నవీన్ పదోన్నతిపై మేనేజర్‌గా విధుల్లో చేరారు. కాగా, నవీన్‌కు బ్యాంకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు, డ్వాక్రా మహిళలకు మరిన్ని సేవలందిస్తానని మేనేజర్ నవీన్ పేర్కొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన పొదుపు సంఘాల మహిళలు

గీసుగొండ, జూన్ 6 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని భూపాలపల్లి జిల్లాలోని 10 గ్రామాలకు చెందిన 15 మంది మహిళా సంఘాల లీడర్లు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఐక్యత, సాధించిన విజయాలను ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి బృందానికి వివరించారు. గ్రామాభివృద్ధి కమిటీలలో మహిళలు కీలక పాత్ర పోషించటమే కాకుండా ఓ టర్మ్ సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులందరిని మహిళలనే ఎన్నుకున్న ఘనత గంగదేవిపల్లికి దక్కిందన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా కమిటీ లీడర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పద్మ, వెంకటేశ్వరమ్మ, ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్, గ్రామ ఆర్పీలు మేడిద సుశీల, గూడ సరోజన పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెసా కమిటీలు కృషి చేయాలి

మంగపేట, జూన్ 6: గిరిజన గ్రామాల్లో ఉన్న సహజ వనరులను ఉపయోగించుకొని ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పెసా జిల్లా కో-ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని అకినేపల్లి-మల్లారంలో 25 గ్రామ పంచాయతీల్లోగల 49 పెసా గ్రామ సభల కమిటీల సమావేశం పెసా జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొమరం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలను గ్రామసభల ద్వారా గిరిజనుల దరిచేరే విధంగా పెసా కమిటీలు పని చేయాలన్నారు. గ్రామాల్లో కులపెద్దలు, యువకులు, డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు, పెసా గ్రామసభలను బలోపేతం చేయాలని ప్రతి మోబిలైజర్ వద్ద గ్రామం, పంచాయతీకి చెందిన సమాచారం ఉండాలన్నారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, 2006, షెడ్యూల్డ్ ప్రాంత పాలన, రాజ్యాంగ నియమాల గురించి పెసా కమిటీలకు అవగాహన కల్పించారు. సమావేశంలో గొప్ప వీరయ్య, మాజీ సర్పంచ్‌లు అప్పినబోయిన నర్సింహమూర్తి, గొప్ప చంద్రకాంత్‌లతో పాటు 49 గ్రామ పంచాయతీల మోబిలైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



చింతలపల్లిలో వెంకటలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

చిట్యాల, జూన్ 6 : మండల కేంద్రంలోని చింతలపల్లికి చెందిన బుర్ర వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుమారులు బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, నరేష్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం పరామర్శించారు. వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, కోఆప్షన్ మెంబర్ రాజ్‌మహ్మద్, నాయకులు చిలుకల రాజకొంరు, దొడ్డి కిష్టయ్య, బుర్ర శ్రీనివాస్, మన్నెం శ్రీనివాసరావు, యూత్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, టౌన్ అధ్యక్షుడు అల్లంరాజు, బుర్ర మల్లేష్ తదితరులు ఉన్నారు. అలాగే బుర్ర వెంకటలక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, జడ్పీటీసీ గొర్రె సాగర్ వేర్వేరుగా పరామర్శించారు. మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, చింతల రమేష్, కిరణ్, పిట్టల రమేష్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

• మొగుళ్లపల్లి : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బల్గూరి రామారావు, ఇస్సిపేటలో పిన్నింటి సరిత, మొగుళ్లపల్లిలో బత్తిని నర్సింహరాములు ఇటీవల మరణించగా ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం పరామర్శించారు. ఇలాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాలకు సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, పున్నంచందర్‌రావు, పోలినేని లింగారావు, తక్కళ్లపల్లి రాజు, ఎమ్డీ.రఫీ, నడిగోటి రాము, ధర్మారావు, ప్రకాష్‌రావు, జైపాల్‌రెడ్డి ఉన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వ్యక్తి హల్‌చల్

▸▸ ఆస్పత్రి బిల్డింగ్ పైకెక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆందోళన



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న సంపత్

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6 : తనను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి ఆస్పత్రి భవనం పైకెక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం కలకలంరేపింది. బాధితుడు భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి కాశీంపల్లి గ్రామానికి చెందిన నూకడి సంపత్ వెల్లడించిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తాను శానిటేషన్ సిబ్బందిగా గత నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపాడు. కరోనా సమయంలో తనకు చెప్పిన ప్రతి ఒక్క పనిని చేశాను. కరోనా వంటి ఆపత్కర సమయాల్లో ఆస్పత్రిలో పనిచేసిన తనను 5 నెలల క్రితం అకారణంగా విధుల నుంచి తొలగించారు. తనను ఎందుకు విధుల నుంచి తొలగించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌ను, స్పార్క్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు ఖాజాను కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి మొరపెట్టుకుంటే ఆయన చెప్పినా సూపరింటెండెంట్ విధుల్లోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. తనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆస్పత్రి అభివృద్ధిపై మీటింగ్ నిర్వహించనున్నారని తెలుసుకున్న సంపత్ ఆస్పత్రి సముదాయంలోని టి-హబ్ బిల్డింగ్ పైకెక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో ఆస్పత్రి తోటి సిబ్బంది అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడికి నచ్చజెప్పారు. ఎమ్మెల్యే మీటింగ్ అయిపోయిన తరువాత నిర్ణయం తీసుకుంటానని హామీ ఇవ్వడంతో సంపత్ బిల్డింగ్ పై నుంచి కిందకు దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.